పార్టీలకతీతంగా బీఆర్ఎస్ పాలన

◆ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

◆ కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

కేటీదొడ్డిలో యువకులకు స్పోర్ట్స్ కిట్టును అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కేటీదొడ్డి, అక్టోబర్ 6: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ పార్టీలకతీతంగా పని చేస్తుందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఇలా పనిచేసే ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేదన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పెళ్లిళ్లు చేయాలంటే పేదలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. అప్పుచేయాల్సి వచ్చేదన్నారు. ఆడబిడ్డకు పెళ్లైతే తల్లిదండ్రులకు కష్టం రాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకం ప్రవేశపెట్టాడని అన్నారు. అలాగే యువకుల క్రీడలు ఆడి ఆరోగ్యంగా ఉండాలన్నారు. అన్నిగ్రామాల యువకులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వినియోగదారుల చైర్మన్ గట్టు తిమ్మప్ప, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ జంబురామన్, గద్వాల మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీధర్‌గౌడ్, ఎంపీపీ మనోరమ, జెడ్పీటీసీ రాజశేఖర్, వైఎస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉరుకుందు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు చక్రధర్ రావు, హనుమంతు, యుగేందర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, నవీన్‌రెడ్డి, గోపి, గోపాల్‌యాదవ్, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఆర్టీసీ బస్టాండ్ పనుల పరిశీలన

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్

గద్వాల అర్బన్ అక్టోబర్ 6: నూతన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో పాటు ఆర్టీసీ బస్టాండ్‌నిర్మాణ పనులను పరిశీలించారు. అన్ని రకాల వ్యాపారాలు ఈ మార్కెట్‌లోనే నిర్మాణం అవుతున్నాయని, అందరి వ్యాపారస్తులకు ఇక్కడ అన్ని వసతులతో షాపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ మార్కెట్‌కు వచ్చినప్పుడు అన్ని వస్తువులను కొనుగోలు చేసే విధంగా అన్ని వ్యాపారాలు ఒకే దగ్గర ఉండేలా అన్ని సౌకర్యాలతో రోడ్లు, పార్కింగ్, పబ్లిక్ టాయిలెట్స్, అన్ని వసతులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హైరిస్క్ వారికి చికిత్స అందించాలి

గద్వాలటౌన్, అక్టోబర్ 6: వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి పాలియేటివ్ సెంటర్లకు తరలించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శశికళ సూచించారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం పాలియేటివ్ కేర్ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. హైరిస్కు ఉన్నవారిని వెంటనే సెంటర్‌కు తరలించి చికిత్స అందించాలని చెప్పారు. మధ్యస్తంగా ఇబ్బందిపడుతున్న వారి ఇండ్లకు వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సిద్దప్ప, ప్రోగ్రామ్ అధికారి రాజు పాల్గొన్నారు. అలాగే ఆశ నోడల్స్, ఆశ ఫెసిలిటేటర్స్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఆడబిడ్డల ఆత్మగౌరవం బతుకమ్మ చీరలు

మల్దకల్, అక్టోబర్ 6: మండలంలోని అమరవాయిలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పద్మ, ఎంపీటీసీ పెద్ద గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ పెద్ద గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకొని బతుకమ్మ పేరిట రాష్ట్రంలోని మహిళలకు ప్రత్యేకంగా చీరలు పంపిణీ చేస్తున్నారన్నారు. 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరు కూడా రేషన్ డీలర్ల దగ్గర తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తూంకృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కృష్ణయ్య, తిమ్మప్ప, జాన్, మహేశ్, పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, డీలర్ తిమ్మారెడ్డి, ప్రజలు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ చేసిన సర్పంచ్

ధరూరు, అక్టోబర్6: సబ్బండ ప్రజల సంస్కృతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం సమాన గౌరవం ఇస్తున్నదని కోతులగిద్ద సర్పంచ్ రమేశ్ అన్నారు. శుక్రవారం గ్రామంలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు రంగస్వామి, ఎస్ఎంసీ చైర్మన్ నర్సింహులు, డీలర్ వేమారెడ్డి, కార్యకర్తలు ఆంజనేయులు, రంగస్వామి పాల్గొన్నారు.

అలంపూర్ మున్సిపాలిటీలో..

అలంపూర్, అక్టోబర్ 6: అలంపూర్ మున్సిపాలిటీలో బతుకమ్మ చీరలను చైర్‌పర్సన్ మనోరమ, వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి మహిళలకు అందజేశారు. చీరలు నాణ్యంగా, మంచి డిజైన్‌లతో రావడంతో మహిళలు ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జితేందర్‌గౌడ్, అల్లాబకాస్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు

చీరలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

అందుబాటులోకి అగ్నిమాపక కేంద్రం

అలంపూర్ చౌరస్తాలో తాత్కాలిక భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అబ్రహం

ఫైర్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం, జిల్లా అధికారి కిశోర్

ఉండవెల్లి అక్టోబర్ 6: మండలంలోని అలంపూర్ చౌరస్తా వ్యవసాయ మార్కెట్ యార్డులో అగ్నిమాపక కేంద్రం తాత్కాలిక భవనాన్ని ఎమ్మెల్యే అబ్రహం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అగ్నిమాపక అధికారి కిశోర్‌తోపాటు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వర్షువల్‌గా 18అగ్నిమాపక కేంద్రాలను హోం శాఖమంత్రి మహమూద్ అలీ ప్రారంభించారన్నారు. సమైఖ్య రాష్ట్రంలో అప్పటి సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేయకపోవడంతో అలంపూర్ నియోజకవర్గంలో అనేక విపత్తులు సంభవించి ఆర్థికంగా నష్టపోయారన్నారు. తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అగ్నిమాపక జిల్లా అధికారి మాట్లాడుతూ నియోజకవర్గంలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే 101కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. 24గంటల పాటు అగ్నిమాపక కేంద్రంలో పోలీస్ సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణమ్మ, ఎంపీటీసీ వరలక్ష్మి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి, వైస్ఎంపీపీ దేవన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

ఉండవెల్లిలో రజకసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే అబ్రహం శుక్రవారం స్థానిక సర్పంచ్ రేఖతో పాటు ప్రారంభించారు. పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను రజక సంఘం నాయకులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. అలాగే మండల కేంద్రంలో బతుకమ్మ చీరలను ఎమ్మెల్యే అబ్రహం, ఎంపీపీ బీసమ్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు లోకేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు సుంకన్న, రాజశేఖర్, బీఆర్ఎస్ నాయకులు నరసింహ, తేజ, రజకసంఘం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఉండవెల్లి అక్టోబర్ 6: మండలంలోని పుల్లూరులోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, కాలేజీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. కల్వకుర్తిలో నిర్వహించిన అండర్17, 19 ఉమ్మడి జిల్లా క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ దేవానందం శుక్రవారం తెలిపారు.అండర్ 17విభాగంలో మానస(లాంగ్ జంప్‌లో ప్రథమ బహుమతి), భారతి మల్లేశ్వరి (టెన్నికాయిట్‌లో ద్వితీయ బహుమతి), మానస అనిత(4+100రిలేలో తృతీయ బహుమతి) సాధించారు. అండర్19 విభాగంలో ఇంటర్ విద్యార్థుల వాలీబాల్ పోటీలో జిల్లా ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు(పూజిత, నందిని, నౌరన్, కేనందిని, రూపారాణి, భవాని), 800 మీటర్ల పరుగుపందెంలో కవిత జిల్లాస్థాయి తృతీయ బహుమతులు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పీఈటీ నవనీతను, విద్యార్థులను సన్మానించారు.

ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ దేవానందం

మహిళలకు ప్రభుత్వ కానుక

పులికల్‌లో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గోవర్ధనమ్మ

అయిజ, అక్టోబర్ 6: తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తున్న బతుకమ్మ పండుగకు మహిళలకు ప్రభుత్వ కానుకగా చీరలను సీఎం కేసీఆర్ అందించి ఆత్మగౌరవాన్ని పెంచుతున్నాడని సర్పంచ్ గోవర్ధనమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని పులికల్‌లో మహిళలకు బతుకమ్మ చీరలను సర్పంచ్ పంపిణీ చేశారు. బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే సంకల్పంతోనే ప్రతి ఏటా చీరలను సర్కారు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కిశోర్, డీలర్లు, మహిళలు పాల్గొన్నారు.

ఎంపీఎల్‌డీ ప్రిన్సిపాల్‌గా కలందర్‌బాషా

గద్వాలటౌన్, అక్టోబర్ 6: ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ షేక్ కలందర్‌బాషా నియామకమయ్యారు. గోదావరిఖనిలో అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ హిందీ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహించిన ఆయనను గద్వాల కళాశాలకు బదిలీ చేస్తూ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

కృషి మహోత్సవ్ విజయవంతం

రైతులకు పీఎస్‌బీని వివరిస్తున్న మండల వ్యవసాయాధికారి హన్మంత్‌రెడ్డి

గట్టు, అక్టోబర్ 6: ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం సంకల్ప్ సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతువేదికలో కృషి మహోత్సవ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి హన్మంత్‌రెడ్డి నానో యూరియా, నానో డీఏపీ, పీఎస్‌బీ, వేపనూనె, వేపపిండి, ఇతర ఆర్గానిక్ ఉత్పత్తులు, వాటి వాడకాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో గట్టు-2 ఎంపీటీసీ కృష్ణ, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ఫార్మర్స్ ప్రొడ్యూస్ అసోసియేషన్ సీఈవో, గట్టు ఏఈవో తోహిద్, ఏఈవోలు, ఉన్నారు.

సెగ్రిగేషన్ షెడ్డు రేకులు చోరీ

సింగవరంలోని సెగ్రిగేషన్ షెడ్డు

అలంపూర్, అక్టోబర్ 6: మండలంలోని సింగవరం-2 గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్డు రేకులు చోరీకి గురైనట్లు సర్పంచ్ అనిత సాయిబాబా తెలిపారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షెడ్డు రేకులను పూర్తిగా తీసుకెళ్లారని పేర్కొన్నారు. 2020లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద షెడ్డు నిర్మాణం చేపట్టగా, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం ప్రారంభించారని తెలిపారు. రేకుల దాదాపు రూ.80వేలు ఉండవచ్చని పేర్కొన్నారు. చోరీ జరిగిన తీరుపై శుక్రవా రం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

నేడు రాములోరి కల్యాణం

ఇటిక్యాల అక్టోబర్6: బీచుపల్లి క్షేత్రంలోని కోదండరామాలయంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం స్వామివారి కల్యాణోత్సవం జరిపించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు తెలిపారు. ప్రతినెలా స్వామివారి జన్మ నక్షత్రాన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.